సాక్షి
సిద్దిపేట
గురువారం । 14 । డిసెంబర్ । 2023



గంగమ్మకు హారతినిస్తున్న మహిళలు

గంగమ్మకు హారతి

దుబ్బాక: కార్తీక పౌర్ణమి, మార్గశిర శుద్ధ పాడ్యమిని పురస్కరించుకుని మహిళలు బుధవారం పోలి స్వర్గం పూజలను వైభవంగా నిర్వహించారు. పట్టణంలోని పెద్ద చెరువు వద్ద గంగమ్మకు హారతులిచ్చి చెరువులో దీపాలను వదిలి కార్తీక మాస వ్రతదీక్షను పూర్తిచేసుకున్నారు. అర్చకుడు రాంబాబు భార్గవ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.

న్యూస్‌రీల్

ఆర్టీసీ బస్సులో మహిళలకు టికెట్



ఓ మహిళకు కండక్టర్ ఇచ్చిన టికెట్

గజ్వేల్‌రూరల్: ఆర్టీసీ బస్సులో ప్రయాణించిన పలువురు మహిళలకు ఓ కండక్టర్ టికెట్ ఇచ్చిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. బస్టాండ్ వద్ద పలువురు మహిళలు దుబ్బాకకు వెళ్ళేందుకు బుధవారం మధ్యాహ్నం గజ్వేల్–ప్రజ్ఞాపూర్ డిపోకు చెందిన బస్సు ఎక్కారు. కండక్టర్ ఆ మహిళలను ఆధార్ కార్డు అడగడంతో వారు తమవద్ద లేవని సమాధానం చెప్పారు. దీంతో వారి నుంచి డబ్బులు తీసుకుని టిక్కెట్లు ఇచ్చారు. అదే బస్సులో ప్రయాణిస్తున్న తోటి ప్రయాణికులు టికెట్‌పై రాసిఉన్న కాల్‌సెంటర్‌కు ఫిర్యాదు చేయడంతో డిపో అధికారుల సూచన మేరకు కండక్టర్ వారికి డబ్బులు తిరిగి చెల్లించారు.

యోగా పోటీల్లో విద్యార్థిని ప్రతిభ



కప్‌ను అందుకుంటున్న నిఖిత

జగదేవ్‌పూర్(గజ్వేల్): జాతీయ స్థాయి యోగా పోటీల్లో జగదేవ్‌పూర్ మండలంలోని ఇటిక్యాల ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని నిఖిత సత్తా చాటింది. ఆమె 67వ జాతీయ స్థాయి యోగా పోటీల్లో రాష్ట్రంలో ప్రథమస్థానంలో ప్రతిభ చాటి జాతీయస్థాయికి ఎంపికయింది. నవంబర్ 23 నుంచి 27 వరకు త్రిపురలోని అగర్తాలో జరిగిన జాతీయస్థాయి యోగా పోటీల్లో రాష్ట్రం తరుపున పాల్గొని ప్రతిభ చాటిందని హెచ్‌ఎం మాధవరెడ్డి తెలిపారు.

'స్థానిక ' ఎన్నికల్లో గెలుపే లక్ష్యం

బీఎస్పీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు యాదగిరి



మాట్లాడుతున్న యాదగిరి

చిన్నకోడూరు(సిద్దిపేట): రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఎస్పీ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పని చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లింగంపల్లి యాదగిరి పిలుపునిచ్చారు. బుధవారం పార్టీ జిల్లా కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో జిల్లాలో మంచి ఓటు బ్యాంకు సాధించామన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా ఇన్‌చార్జి ఉమేశ్, నాయకులు అశోక్, నర్సింలు, బాను, మహేశ్, హరికిరణ్, ప్రశాంత్, శంకర్, లింగం, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం సారూ.. ఉద్యోగం ఇచ్చి ఆదుకోరూ..

సోషల్ మీడియాలో వీడియో వైరల్

హుస్నాబాద్: ఆర్టీసీలో కారుణ్య నియామకం చేపట్టి ఉద్యోగం ఇచ్చి ఆదుకోవాలని బతుకు తెరువు కోసం దుబాయికి వెళ్లిన ఓ యువకుడు సోషల్ మీడియా వేదికగా ముఖ్యమంత్రికి గోడును వెళ్లబోసుకున్నాడు. హుస్నాబాద్‌కు చెందిన రాగుల వెంకటేశ్ దుబాయి నుంచి విడుదల చేసిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. తన తండ్రి మల్లయ్య జగిత్యాల డిపోలో మెకానిక్‌గా పని చేసేవాడని, బస్ రిపేర్ చేస్తుండగా బలమైన రాడ్డు కాళ్లపై పడడంతో అన్‌ఫిట్ అనిచెప్పి ఉద్యోగం నుంచి తొలగించారని వాపోయాడు. తర్వాత గాయం ఇన్‌ఫెక్షన్ కావడంతో తన తండ్రి మృతి చెందాడని, పదేళ్ల నుంచి ఆర్టీసీలో కారుణ్య నియామకం కోసం ఎదురుచూసినా ఫలితం లేకుండా పోవడంతో ఉపాధి కోసం దుబాయికి వచ్చానని చెప్పాడు. ఇప్పటికైనా కారుణ్య నియామకం కింద ఆర్టీసీలో ఉద్యోగం ఇచ్చి ఆదుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఆర్టీసీ ఎండీ సజ్జనార్లకు విజ్ఞప్తి చేశాడు.

సమర్థవంతంగా పాలన

- పకడ్బందీగా సంక్షేమ పథకాల అమలు
- నిర్వాసితుల సమస్యలకు పరిష్కారం
- కచ్చితంగా ఆరు గ్యారంటీలు..
- మెడికల్ కళాశాల ప్రక్రియ షురూ
- 'సాక్షి'తో మంత్రి పొన్నం ప్రభాకర్



డిగ్రీ కళాశాల మైదానంలో వాకింగ్ చేస్తున్న మంత్రి పొన్నం

సాక్షి, సిద్దిపేట: నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ, సమర్థవంతంగా, నీతివంతమైన పాలన అందిస్తామని, రిజ్వాయర్‌ల విషయంలో భూమి కోల్పోయిన నిర్వాసితులకు న్యాయం చేస్తామని, ఆరు గ్యారంటీలను కచ్చితంగా అమలు చేస్తామని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సిద్దిపేటలో బుధవారం మార్నింగ్ వాక్ అనంతరం సాక్షి పలకరించింది. ఆయన మాటల్లోనే..

నిర్వాసితులకు న్యాయం చేస్తాం

జిల్లాలో కొమురవెల్లి మల్లన్న సాగర్, కొండపోచమ్మ, రంగనాయకసాగర్, గౌరవెల్లి రిజర్వాయర్ నిర్మాణంలో నిర్వాసితుల సమస్యలు ఎక్కడిక్కడే ఉన్నాయి. అధికారులతో రివ్యూ నిర్వహించి వారికి న్యాయం చేస్తాం. గౌరవెల్లి రిజర్వాయర్ నిర్లక్ష్యానికి గురైంది. పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తిచేసి సాగు నీటిని అందిస్తాం.

మెడికల్ కళాశాల ప్రక్రియ షురూ.

హుస్నాబాద్‌లో మెడికల్ కళాశాల ఏర్పాటు కోసం ప్రక్రియ ప్రారంభమైంది. ఆ కాలేజీకి అనుబంధంగా ఆస్పత్రి ఏర్పాటు చేయడంతో ప్రజలకు మెరుగైన వైద్యం అందుబాటులోకి వస్తుంది. ప్రజలు ప్రభుత్వాన్ని మార్చుకొని కొత్త ప్రభుత్వాన్ని ఎన్నుకున్నారు. ప్రభుత్వం హామీ ఇచ్చిన ఆరు గ్యారంటీలు, సంక్షేమ కార్యక్రమాలను కచ్చితంగా అమలు చేస్తాం. మొదటి గ్యారంటీగా ప్రారంభించిన మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం పథకానికి ప్రజల నుంచి అనూహ్యమైన స్పందన వచ్చింది. బలహీన వర్గాలకు సంక్షేమ హాస్టళ్లు, గురుకులాలలో నాణ్యమైన విద్యను అందిస్తాం. కులవృత్తులు చేసే వారికి ఆర్థికసాయం అందజేస్తాం.

మరింత అభివృద్ధి..

జిల్లాను అభివృద్ధిలో పరుగెత్తిస్తాం. విద్యుత్ శాఖలో రూ.85 వేల కోట్లు, సివిల్ సప్లయ్ కార్పొరేషన్‌లో రూ.56 వేల కోట్ల అప్పు ఉందని తేలింది. వ్యవసాయానికి ఉచిత విద్యుత్‌ను గతంలో మేమే ప్రారంభించాం. అది ఎప్పటికీ కొనసాగుతుంద. ప్రజలకు ఏ ఇబ్బంది కలిగినా నేరుగా సంప్రదిస్తే పరిశీలించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం.

నెగెటివ్ ధోరణిలో పోవద్దు

సిద్దిపేటజోన్: ''పది మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు బీఆర్‌ఎస్ పార్టీతో టచ్‌లో ఉన్నారని మాట్లాడుతున్నావు.. నీవు ఏమైనా జ్యోతిష్యం చదివావా రాజాసింగ్' అంటూ రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో మార్నింగ్ వాకింగ్ అనంతరం మీడియాతో మాట్లాడారు. 110 సీట్లలో డిపాజిట్లురాని బీజేపీ ఇప్పుడే కాంగ్రెస్ ప్రభుత్వం కూలిపోతుందని, ఈ ప్రభుత్వం ఎక్కువ కాలం కొనసాగదని అంటున్నారని వాపోయారు. ప్రభుత్వం మారింది. మీలో కూడా మార్పు రావాలని, నెగెటివ్ ధోరణిలో పోవద్దని ప్రతిపక్షాలకు సూచించారు. ప్రొటెం స్పీకర్ విషయాన్ని మతపరంగా చూడొద్దని, సీనియర్ ప్రాతిపదికన నియామకం జరిగిందని స్పష్టం చేశారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు నర్సారెడ్డి, సిద్దిపేట, దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జిలు హరికృష్ణ, శ్రీనివాస్ రెడ్డి, పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తు, సీనియర్ నాయకులు ప్రభాకర్ వర్మ, మహేందర్, సీపీఐ జిల్లా కార్యదర్శి పవన్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ మరింత బలోపేతం

- మహిళలు, విద్యార్థినులతో మాటామంతి
- మహాలక్ష్మి పథకం అమలుపై ఆరా



బస్సులో ప్రయాణికులతో మాట్లాడుతున్న మంత్రి

సిద్దిపేటకమాన్: ప్రభుత్వ విధానం ప్రజల అభిప్రాయం మేరకే నడుస్తుందని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. సిద్దిపేట మోడ్రన్ బస్టాండ్‌ను ఆయన బుధవారం సందర్శించారు. అనంతరం మాట్లాడుతూ గత ప్రభుత్వం ఆర్టీసీని గాలికి వదిలేసిందని, ఆర్టీసీని మరింత బలోపేతం చేస్తామన్నారు. బస్టాండ్‌లోని ప్రయాణికులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బస్సెక్కి ప్రయాణికుల పక్కన కూర్చుని కొంతసేపు మాట్లాడారు. మహాలక్ష్మి పథకం అమలు తీరుపై మహిళలను ఆరా తీశారు. మహిళా ప్రయాణికులు, చిరు వ్యాపారాలు చేసుకునే మహిళలు, విద్యార్థినులతో మంత్రి మాట్లాడి ఉచిత ప్రయాణం గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మరిన్ని కొత్త బస్సులను ప్రజల కోసం అందుబాటులోకి తీసుకువస్తామని, ఇకపై విద్యార్థినులు బస్సు పాస్‌లు తీసుకోవాల్సిన అవసరం లేదన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ అధికారులు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్

'ఉపాధి' హాజరు శాతం పెంచాలి

కలెక్టర్ ప్రశాంత్‌జీవన్ పాటిల్

సిద్దిపేటరూరల్: ఉపాధి హామీ పథకంలో కూలీల హాజరు శాతం పెంచేలా చూడాలని కలెక్టర్ ప్రశాంత్ జీవన్‌పాటిల్ అధికారులను ఆదేశించారు. అన్ని మండలాల సంబంధిత అధికారులతో బుధవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్‌ఆర్‌ఈజీఎస్‌లో భాగంగా కూలీల సేకరణ శాతంలో జిల్లా కింది వరుసలో ఉందని అసహనం వ్యక్తం చేశారు. జిల్లాలో కొత్తగా పాంపాండ్, ఫిష్‌పాండ్‌ల ఏర్పాటుకు గ్రామాల్లో పర్యటించాలని, ఈ నెలలో తప్పనిసరిగా మండలానికి 5 చొప్పున పూర్తి చేయాలన్నారు. జిల్లాలో స్వయం సహాయక బృందాలకు అందించాల్సిన రుణాల లక్ష్యాన్ని పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర, ఘర్ ఘర్ కిసాన్ క్రెడిట్ కార్డు అభియాన్, పాడిపరిశ్రమ, మత్స్యకారులకు అందించే రుణాల గురించి అవగాహన కల్పించాలని, హరితహారంలో భాగంగా నర్సరీలలో మొక్కల పెంపకం చేపట్టాలని, తోటల పెంపకం లక్ష్యాన్ని పూర్తిచేయాలని కోరారు. అధికారులు విధుల్లో అలసత్వం ప్రదర్శిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్, డీఆర్డీఏ పీడీ జయదేవ్ ఆర్య, ఎల్డీఎం సత్యజిత్, జెడ్పీ సీఈఓ రమేశ్, డీపీఓ దేవకిదేవి, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

15న కేంద్ర టెక్స్‌టైల్ శాఖ అధికారి రాక



సమీక్ష నిర్వహిస్తున్న గరిమా అగర్వాల్

అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్

సిద్దిపేటరూరల్: వీక్షిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా ఈ నెల 15న కేంద్ర ప్రభుత్వ టెక్స్‌టైల్ మంత్రిత్వశాఖ జాయింట్ సెక్రటరీ అజయ్‌గుప్తా జిల్లాలో పర్యటించనున్నారని, అందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం అదనపు కలెక్టర్(రెవెన్యూ) శ్రీనివాస్ రెడ్డితో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పర్యటనలో భాగంగా నారాయణరావుపేట మండల పరిధిలోని గుర్రాలగొంది గ్రామంలో ఒక ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేయాలని, జిల్లాలో అమలవుతున్న కేంద్ర ప్రభుత్వ పథకాల నమూనాలు, ఫ్లెక్సీలు, స్టాళ్ల ఏర్పాటు, వీడియో రూపంలో ప్రదర్శించాలని ఆదేశించారు. సమావేశంలో డీఆర్డీఏ జయదేవ్ ఆర్య, డీపీఓ దేవకీదేవి, ఎల్డీఎం సత్యజిత్, డీఎంహెచ్ఓ డాక్టర్ కాశీనాథ్, ఇతర అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

పీఏసీఎస్ చైర్మన్‌పై అవిశ్వాసం

- 10 మంది డైరెక్టర్ల తీర్మానం
- అవినీతిలో పాత్ర ఉందని ఆరోపణలు




దుబ్బాక పీఏసీఎస్ కార్యాలయం

దుబ్బాక టౌన్: స్థానిక ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘంలో పాలక మండలి సభ్యుల మధ్య కొంత కాలంగా విభేదాలు తీవ్ర స్థాయికి చేరుకున్నాయి. అవి అవిశ్వాస తీర్మానానికి దారి తీశాయి. దుబ్బాక పీఏసీఎస్‌లో 2020 ఫిబ్రవరి 16న ప్రస్తుత చైర్మన్ శేర్ల కైలాష్ ఆధ్వర్యంలో వైస్ చైర్మన్‌తో పాటు, 11 మంది డైరెక్టర్లతో పాలక మండలి ఏర్పాటైంది. మూడేళ్ళలో సంఘానికి చెందిన 10 మంది డైరెక్టర్లు చైర్మన్ కైలాష్‌పై అవిశ్వాసం పెట్టాలని నిర్ణయించారు. మంగళవారం జిల్లా సహకారశాఖ అధికారిణి కరుణను కలిసి అవిశ్వాస తీర్మాన పత్రాన్ని అందజేశారు. బుధవారం ఆ నోటీసును దుబ్బాక పీఏసీఎస్ కార్యాలయంలో అతికించారు. గత ఏడాది జూన్‌లో దుబ్బాక పీఏసీఎస్‌లో రూ.35 లక్షల అవినీతి జరిగిన విషయం విధితమే. అవినీతిలో ప్రధాన పాత్ర పోషించిన సీఈఓ లక్ష్మారెడ్డిని అధికారులు శాశ్వతంగా తొలగించి విచారణ ప్రారంభించారు. విచారణ పూర్తయి ఏడాది గడిచినా ఒక్క రూపాయి కూడా రికవరీ చేయలేకపోయారు. అవినీతిలో చైర్మన్ పాత్ర ఉందంటూ కొంత మంది డైరెక్టర్లు, చైర్మన్‌కు పాలక మండలికి మధ్య విభేదాలు ప్రారంభమయ్యాయి. దీంతో కొంత కాలంగా సకాలంలో సమావేశాలు నిర్వహించకపోవడం, చైర్మన్ ఏకపక్ష నిర్ణయాల వల్ల పాలక మండలికి దూరం పెరిగింది. అదే విధంగా ప్రతి ఏడాది జరుగుతున్న ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణ అధ్వానంగా ఉండడంతో ఇప్పుడున్న చైర్మన్‌ను తొలగించి నూతన చైర్మన్‌ను ఎన్నుకోవడానికి సిద్ధమయ్యారు. జనవరి 9న జిల్లా సహకారశాఖ అధికారి కరుణ ఆధ్వర్యంలో అవిశ్వాస తీర్మానంపై ఓటింగ్ నిర్వహించనున్నారు. దీనిపై ఆమెను వివరణ కోరగా దుబ్బాక పీఏసీఎస్ చైర్మన్‌పై 10 మంది డైరెక్టర్లు అవిశ్వాస తీర్మాన పత్రాన్ని తనకు అందజేసినట్లు స్పష్టంచేశారు. అవినీతిపై బాధ్యులుగా తేలిన వారిపై సర్‌ఛార్జి ఉత్తర్వులు జారీ చేస్తామని, వారి నుంచి డబ్బు రికవరీ చేస్తామని ఆమె చెప్పారు.

రెగ్యులర్ కమిటీ లేనట్టేనా?

- మల్లన్న ఆలయంలో మల్లగుల్లాలు
- ఉత్సవ కమిటీని నియమించే అవకాశం
- పైరవీలు ప్రారంభించిన పలువురు నేతలు



మల్లికార్జున స్వామి ఆలయ రాజగోపురం

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయంలో ధర్మకర్తల మండలి పదవీ కాలం గత సెప్టెంబర్ 20 తో ముగిసింది. వెంటనే దేవదాయశాఖ అధికారులు రెగ్యులర్ కమిటీకి నోటిఫికేషన్ జారీ చేయవలసి ఉంటుంది. అందుకు అప్పుడు కొంత మంది బీఆర్ఎస్ పార్టీ నేతలు పావులు కదిపినా ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కావడంతో ఆలయ రెగ్యులర్ కమిటీకి నోటిఫికేషన్ నిలిచిపోయింది.

సమయం లేకపోవడంతో..

ఇటీవల ఎన్నికల ప్రక్రియ పూర్తవడం, నూతనంగా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో ఇప్పుడు అందరి చూపు మల్లన్న ఆలయ ధర్మకర్తల మండలి నియామకం వైపు మళ్లింది. జనవరి 7న స్వామి కల్యాణం జరగనుంది. దీంతో దేవదాయశాఖకు రెగ్యులర్ కమిటీ నియమించే సమయంలేదు. రెగ్యులర్ కమిటీని నియమించాలంటే నోటిపికేషన్ జారీ చేసి 45 రోజుల సమయం ఇచ్చి దరఖాస్తులు కోరాలి. ఆ తర్వాత వాటిని పరిశీలించి, విచారించి కమిటీని ప్రకటించాలి. స్వామి కల్యాణం వచ్చే నెల 7 ఉండడం, అదేవిధంగా సంకాంత్రి నుంచి జాతర మొదలు కానుడడంతో మూడు నెలల కోసం ఉత్సవ కమిటీని నియమించే అవకాశాలే ఎక్కువగా కనబడుతున్నాయి.

పైరవీలు ప్రారంభం

కమిటీ ఏర్పాటుకు అధికారులు సిద్ధమవుతున్న నేపథ్యంలో కొంత మంది కాంగ్రెస్ నాయకులు పైరవీలు ప్రారంభించినట్లు సమాచారం. సుమారు పదేళ్ల ఆ పార్టీ ప్రతిపక్షంలో ఉండడంతో ఆ నాయకులకు నామినేటెడ్ పదవులకు దూరంగా ఉన్నారు. ఇప్పుడు అధికారంలోకి రావడంతో ఆ ప్రాంత నాయకులు ఉత్సవ, రెగ్యులర్ కమిటీలలో స్థానం కోసం పాకులాడుతున్నారు. చేర్యాల మాజీ జెడ్పీటీసీ నర్సింగరావు, చేర్యాల మాజీ ఎంపీపీ బోడిగె నర్సింహులు, మహదేవుని శ్రీనివాస్, కొయ్యడ శ్రీనివాస్, వల్లాద్రి అంజిరెడ్డి, లింగంపల్లి కనకరాజు, చెరుకు రమణారెడ్డి, జంగని రవి, జీవన్‌రెడ్డి, ముస్త్యాల యాదగిరితో పాటు జనగామ, మద్దూరు నర్మెట్ట, హుస్నాబాద్‌కు చెందిన మరి కొందరి నేతల పేర్లు చైర్మన్ రేసులో ఉన్నట్లు వినిపిస్తున్నాయి.

పొన్నం అనుచరులకే..

మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ ప్రధాన అనుచరులకు చైర్మన్‌గా అవకాశం కల్పిస్తారని పలువురు స్థానిక నేతలు అభిప్రాయపడుతున్నారు. చేర్యాల, కొమురవెల్లి మండలలాకు చెందిన స్థానిక నేతలకే చైర్మన్ పదవి కట్టబెట్టాలని పలువురు కోరుతున్నట్లు సమాచారం. కొంత కాలంగా ఆలయంలో ధర్మకర్తల మండలి లేకపోవడంతో ఆలయంలో అధికారులు తమ ఇష్టానుసారంగా పని చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో ఆలయ ప్రతిష్ట దెబ్బతినే అవకాశం ఉందని, ప్రభుత్వం, దేవదాయశాఖ అధికారులు స్పందించి వెంటనే ఆలయంలో ధర్మకర్తల మండలి నియమించాలని చాలా మంది కోరుతున్నారు.

ప్రైవేటు స్కూల్ టీచర్ అదృశ్యం



వేణు (ఫైల్)

సిద్దిపేటకమాన్: ఓ ప్రైవేటు స్కూల్‌లో టీచర్‌గా విధులు నిర్వహిస్తున్న ఒక ఉపాధ్యాయుడు అదృశ్యమైన ఘటనపై టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన ఈసరి వేణు(40) ఓ ప్రైవేటు స్కూల్‌లో టీచర్‌గా పని చేస్తున్నాడు. మంగళవారం ఆయన తన కూతురుతో కలిసి స్కూల్ బస్సులో పాఠశాలకు బయలుదేరాడు. మార్గ మధ్యంలో సిద్దిపేట పాత బస్టాండ్ వద్ద బస్సుదిగి పోయాడు. సాయంత్రం వరకు అతడు తిరిగి ఇంటికి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు వెతికినా ఆచూకీ తెలియకపోవడంతో తమకు ఫిర్యాదు చేయగా బుధవారం కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రూ.22.88 లక్షలు స్వాహా

- సైబర్ నేరాలపై అవగాహన అవసరం
- పోలీస్ కమిషనర్ శ్వేత



సిద్దిపేటఅర్బన్: లాటరీ, ఉద్యోగ ప్రకటనలు, బ్యాంకు అకౌంట్ అప్‌డేట్, గిఫ్ట్ బాక్సులు, లోన్ యాప్, తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభం వంటివి ఆశ చూపి సైబర్ నేరస్తులు అమాయక ప్రజల నుంచి డబ్బులు కొల్లగొడుతున్నారని, సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని పోలీస్ కమిషనర్ శ్వేత సూచించారు. త్రీటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన ఓ సైబర్‌క్రైమ్ కేసు వివరాలను బుధవారం ఆమె వెల్లడించారు. సైబర్ నేరగాళ్లు బాధితుడి వాట్సాప్‌కు త్రీస్టార్, ఫైవ్ స్టార్ హోటల్స్‌కు రివ్యూ రాసి పంపిస్తే డబ్బులు ఇస్తామని పంపిన మెసేజ్‌ను నమ్మి అతడు రివ్యూ పంపగా నేరగాడు కొంత డబ్బులు జమ చేశాడు. ఆ తర్వాత యూట్యూబ్‌లో ట్రేడింగ్ చానల్‌ను సబ్‌స్క్రైబ్‌చేసి డబ్బులు పెట్టుబడి పెడితే ఎక్కువ మొత్తంలో లాభాలు వస్తాయని చెప్పగా నమ్మిన బాధితుడు మొదటగా రూ.వెయ్యి పంపగా తన ఖాతాలో రూ.1500 జమచేశారు. తర్వాత రూ.3 వేలు పంపగా రూ.4 వేలు, ఆ తర్వాత రూ.లక్ష పంపితే రూ.1.50 లక్షలు నేరగాళ్లు జమచేశారు. అలా బాధితుడు మొత్తంగా రూ. 22,88,980 ఆర్‌టీజీఎస్ ద్వారా పంపించాడు. డబ్బులు తిరిగి రాకపోవడంతో సైబర్ నేరగాడికి ఫోన్ చేయగా స్విచ్‌ఆఫ్ వచ్చింది. దీంతో అనుమానం వచ్చిన బాధితుడు వెంటనే సైబర్ క్రైమ్ జాతీయ హెల్ప్‌లైన్ నెంబర్ 1930కు కాల్‌చేసి ఫిర్యాదు చేశాడని సీపీ శ్వేత తెలిపారు. సైబర్ నేరాలపై అవగాహన పెంచుకోవాలని ఆమె సూచించారు.

క్లుప్తంగా

రాష్ట్రస్థాయికి ఎంపిక



నాగేందర్‌గౌడ్‌తో కళాశాల సిబ్బంది

దుబ్బాక : స్కూల్ ఫెడరేషన్ అండర్–19 రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు దుబ్బాక ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన చేపూరి నాగేందర్ గౌడ్ ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీ నారాయణ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. విద్యార్థులకు క్రీడల్లో శిక్షణ ఇస్తున్న కళాశాల సిబ్బంది సాంబశివ రావును ప్రత్యేకంగా అభినందించారు.

మోడల్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులతో ప్రిన్సిపాల్ భాస్కర్‌రెడ్డి

మునిపల్లి(అందోల్):మునిపల్లి మోడల్ స్కూల్ విద్యార్థులు అండర్–17 బాల బాలికల రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో పాల్గొన్నట్లు మునిపల్లి మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ భాస్కర్ రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన విద్యార్థులతో కలిసి మాట్లాడారు. మహబూబ్ నగర్ జిల్లా జడ్చర్ల మండలం బాదేపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో ఈ నెల 8,9,10 తేదీల్లో రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ టోర్నమెంట్ జరిగిందన్నారు. ఇందులో మునిపల్లి మోడల్ స్కూల్ నుంచి వర్షిత, వందశ్రీ, అమూల్య, ప్రవంతి, ధీరజా, బాలురు అఖిల్ పాల్గొన్నట్లు తెలిపారు. విద్యార్థులను, పీడీ మన్సూర్ అహ్మద్‌ను ప్రిన్సిపాల్ అభినందించారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల పరిశీలకుడిగా గోవర్ధన్‌రెడ్డి



గజ్వేల్‌రూరల్: రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల పరిశీలకుడిగా గోవర్ధన్‌రెడ్డి ఎంపిక య్యారు. ఈనెల 13 నుంచి 15 వరకు ఎస్‌జీఎఫ్ (స్కూల్ గేమ్స్ ఫెడరేషన్) ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్ జిల్లాలోని నారాయణరావు పేటలో అండర్–14 బాలబాలికల విభాగంలో రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలు జరుగనున్నాయి. గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పీఈటీగా విధులు నిర్వహిస్తున్న గోవర్ధన్ రెడ్డి రాష్ట్రస్థాయి పోటీల్లో బాలికల విభాగానికి పరిశీలకుడిగా వ్యవహరిస్తున్నారు.

రేపు మెదక్‌లో ర్యాలీ

మెదక్ కలెక్టరేట్: ఈనెల 15న జిల్లాస్థాయిలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు జిల్లా స్త్రీ, శిశు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ అధికారి బ్రహ్మాజీ బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా మెదక్ జిల్లా కేంద్రంలోని ధ్యాన్‌చంద్ చౌరస్తా నుంచి ఇందిరాగాంధీ స్టేడియం వరకు ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు.

టైలరింగ్‌లో ఉచిత శిక్షణ

గజ్వేల్‌రూరల్: గ్రామీణ మహిళలు, నిరుద్యోగ యువతులకు టైలరింగ్, ఫ్యాషన్ డిజైనింగ్‌లో 30 రోజుల పాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ డైరెక్టర్ రాజలింగం బుధవారం తెలిపారు. గజ్వేల్, ములుగు, వర్గల్ మండలాల పరిధిలోని ఆయా గ్రామాలకు చెందిన 18 నుంచి 45 ఏళ్ల మధ్య వయస్సు కలిగి, 10 వ తరగతి చదివిన వారు అర్హులన్నారు. శిక్షణ కాలంలో ఉచిత యూనిఫామ్, కోర్సు మెటీరియల్‌తో పాటు టీ, భోజన సదుపాయం, టూల్ కిట్స్ అందిస్తామన్నారు. శిక్షణ అనంతరం కేంద్ర గ్రామీణ అభివృద్ధి మంత్రిత్వ శాఖ నుంచి స్కిల్ ఇండియా వారి సర్టిఫికెట్‌తో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సబ్సిడీ రుణాలకు సహకరించడం జరుగుతుందన్నారు. గజ్వేల్ పట్టణంలోని ఐఓసీ (ఇంటిగ్రేటెడ్ ఆఫీస్ కాంప్లెక్స్)లో ఈనెల 18 నుంచి శిక్షణ ప్రారంభమవుతుందన్నారు. ఆసక్తిగలవారు ఈనెల 15వ తేదీలోగా 99498 82026 నంబరుకు ఫోన్‌చేసి తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

బట్వాడాకు బ్రేక్



గ్రామీణ తపాలా ఉద్యోగులు (జీడీఎస్) తమ డిమాండ్ల సాధన కోసం సమ్మె బాట పట్టారు. దీంతో జిల్లా వ్యాప్తంగా తపాలా బట్వాడా సేవలు నిలిచాయి. సమ్మె గురించి గతంలోనే సంబంధిత ఉన్నతాధికారులకు వినతిపత్రాలు సమర్పించినట్లు ఉద్యోగులు పేర్కొంటున్నారు. హామీలు పూర్తిస్థాయిలో అమలుకు నోచుకోకపోవడంతో తిరిగి సమ్మెకు దిగారు. ముఖ్యంగా ఈ మారు కమలేష్ చందర్ కమిటీ సిఫారసు అంశాలను పూర్తిస్థాయిలో అమలు చేయాలన్న తదితర డిమాండ్లు వినిపిస్తున్నాయి. జీడీఎస్‌లు చేపడుతున్న సమ్మెతో ఉపాధి హామీ కూలీలకు చెల్లింపులు, ఉత్తరాల బట్వాడా, డిపాజిట్లు, విత్‌డ్రాలు, సుకన్య సమృద్ధి యోజన లాంటి సేవలకు అంతరాయం ఏర్పడింది.

– నారాయణఖేడ్

సమ్మె బాటలో తపాలా ఉద్యోగులు

- నిలిచిన పోస్టాఫీస్ సేవలు
- జిల్లా వ్యాప్తంగా కొనసాగుతున్న నిరసలు
- సమస్యల పరిష్కారం కోసం పోరుబాట





సమ్మె చేస్తున్న తపాలా ఉద్యోగులు

జిల్లాలో సంగారెడ్డి, జహీరాబాద్, రామచంద్రాపురంలో ప్రధాన తపాలా కార్యాలయాలతోపాటు, సబ్ పోస్టాఫీసులు, శాఖ తపాలా కార్యాలయాలు 275 కార్యాలయాలు ఉన్నాయి. ఇందులో 80 మంది వరకు ప్రభుత్వ ఉద్యోగులు ఉండగా బీపీఎం, ఏడీపీఎం, డాక్ సేవక్, జీడీఎస్‌లు 400 మందికి పైగా ఉన్నారు. వీరందరూ ఏళ్ల తరబడి పనిచేస్తున్నప్పటికీ రూ.16 వేల వేతనంతోనే సరిపుచ్చుకుంటున్నారు. వీరి సమస్యలను పరిష్కరించే విషయంలో త్వరలో అమలు చేస్తామని గతంలో ప్రభుత్వ వర్గాలు యూనియన్ నాయకులతో ఒప్పందం కుదిర్చినప్పటికీ ఇప్పటికీ అమలుకు నోచుకోలేదని పేర్కొంటున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో సమ్మెకు పూనుకున్నామని ఉద్యోగులు అంటున్నారు. తక్షణమే నివేదికలోని తమ న్యాయమైన అంశాలను ఆమోదించి తమ సమస్యలను పరిష్కరించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. జీడీఎస్‌ల ద్వారా దేశ వ్యాప్తంగా తపాలాశాఖకు 80 శాతంపైగా లాభాలను ఆర్జించి పెడుతున్నప్పటికీ తమ సమస్యల పరిష్కారంలో, ఇచ్చిన హామీల అమలులో వివక్ష చూపుతోందని జీడీఎస్ ఉద్యోగులు అంటున్నారు.

ఉద్యోగుల సమస్యలు..

- ఉద్యోగులకు ప్రభుత్వపరంగా ఆరోగ్య సదుపాయం లేదు. 65 సంవత్సరాలు వస్సులో ఉద్యోగ విరమణ అనంతరం శాఖాపరంగా ఎలాంటి పింఛన్ సదుపాయం ఉండదు.
- సెలవులు లేకపోగా అత్యవసర పనులకు వెళ్లాల్సి వస్తే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకొని వెళ్లాల్సిందే. ఒక్కో బీపీఎం రూ.లక్షల్లో ఆసరా, ఉపాధి కూలీ చెల్లింపులు, ఇతర డిపాజిట్ల రూపేనా సొంత రక్షణ చేపట్టుకోవాల్సిందే.
- దురదృష్టవశాత్తు అనుకోని విపత్తు జరిగినా సదరు ఉద్యోగే బాధ్యత వహించాల్సి ఉంటుంది. ప్రతిభ ఆధారంగానే ఉద్యోగ నియామక ప్రక్రియ చేపడుతున్నప్పటికీ ఉద్యోగ భద్రత, వేతనం ఇతర సదుపాయాలు ఆ స్థాయిలో ఉండటంలేదు.

ఇవీ డిమాండ్లు..

- ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా కుటుంబసభ్యులకు కార్పొరేట్ వైద్య సదుపాయం కల్పించాలి. కమలేష్ చంద్ర వేతన కమిటీ సిఫార్సులను పూర్తిస్థాయిలో అమలు చేయాలి.
- ఉద్యోగ విరమణ ప్యాకేజీ రూ.5లక్షలు చెల్లించాలి. జీడీఎస్‌లకు 8గంటల పనికల్పించి సివిల్ సర్వెంట్ హోదా ఇవ్వాలి. కనీస వేతనంతోపాటు 12, 24, 36 సంవత్సరాల సీనియార్టీ ప్రకారం వేతనాలు చెల్లించాలి.
- ఫిట్‌మెంట్ మార్చడంతోపాటు పూర్తిస్థాయి కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి. టార్గెట్ల పేర ఉన్నతోద్యోగుల మానసిక వేధింపులు, వేతనాల నిలుపుదల, వాట్సాప్ ద్వారా పగలు, రాత్రి బెదిరింపులు ఆపివేయాలి.
- ఎన్‌ఆర్‌ఈజీఎస్, ఆర్‌పీఎల్‌ఐ, పీఎల్‌ఐ, ఐపీపీబీ మొదలగు స్కీంలను వర్క్‌లోడ్‌లోకి తీసుకోవాలి. గ్రూపు ఇన్సూరెన్స్ రూ.5 లక్షలకు పెంచాలి.
- ఎస్‌డీబీఎస్‌కు జీడీఎస్ కాంట్రిబ్యూషన్ 10 శాతం, డిపార్ట్‌మెంట్ కాంట్రిబ్యూషన్ 10 శాతం ఇవ్వాలి.

సమస్యలు పరిష్కరించాలి



తమ న్యాయమైన డిమాండ్లను తక్షణం పరిష్కరించాలి. 8 గంటల పని విధానం అమలు చేస్తూ పెన్షన్‌తోపాటు అన్ని ప్రయోజనాలను మంజూరు చేయాలి. గ్రూప్ ఇన్సూరెన్స్ రూ.5 లక్షలకు గ్రాట్యూటీ రూ.5 లక్షలకు పెంచాలి. పెయిడ్ లీవ్‌ను 180 రోజుల వరకు దాచుకొని నగదుగా మార్చుకొనే సౌకర్యం కల్పించాలి. జీడీఎస్‌లు, కుటుంబ సభ్యులకు వైద్య సౌకర్యం కల్పించాలి.

– నర్సారెడ్డి, డాక్‌సేవక్, ఖేడ్ సబ్ పోస్టాఫీస్

డిమాండ్లు తీర్చాలి



తపాలా శాఖలో దశాబ్దాలుగా చాలీచాలని వేతనాలతో ఉద్యోగం చేస్తున్నాం. మా సమస్యలను వెంటనే పరిష్కరించాలి. కమలేష్ చందర్ సిఫార్సులను అమలు చేయాలి. తమకు ఉద్యోగ భద్రత కల్పించడంతోపాటు పింఛన్ సదుపాయం కల్పించాలి. సీనియార్టీ ప్రకారం అర్హులైన వారికి పదోన్నతులు కల్పించాలి. సమస్యలు పరిష్కారం అయ్యేవరకు సమ్మె కొనసాగుతుంది.

– శిరోమణి, యూనియన్ జిల్లా అధ్యక్షుడు

పంటల పరిశోధనపై ఒప్పందం



ఒప్పంద పత్రాలను చూపుతున్న అధికారులు

ములుగు(గజ్వేల్) : ములుగు కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయం (ఎస్‌కేఎల్‌టీఎస్‌హెచ్‌యూ) హైదరాబాద్‌కు చెందిన అర్బన్ కిషాన్ ఫామ్స్ ప్రైవేట్ లిమిటెడ్‌ల మధ్య బుధవారం పరస్పర సహకార ఒప్పందం కుదుర్చుకున్నారు. ములుగు విశ్వవిద్యాలయ వైస్ ఛాన్స్‌లర్ డాక్.బీ నీరజప్రభాకర్, అర్బన్ కిషాన్ ఫామ్స్ ప్రతినిధి డాక్టర్.సాయిరెడ్డి ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ.. చిల్లి, చెర్రీ , టమాట పంటల పరిశోధనల అభివృద్ధిపై దృష్టి సారించడంతోపాటు విశ్వవిద్యాలయంలో కొనసాగుతున్న ధ్యానపు పంటల పరిశోధనల సమాచారాన్ని పంచుకుంటూ సహాయ సహకారాలు అందించుకోవడమే ఈ ఒప్పందం యొక్క ముఖ్య ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ అధికారులు భగవాన్, కిరణ్‌కుమార్, రాజశేఖర్, విజయ, శ్రీనివాస్, నర్సిరెడ్డి, విహారీ, సంపత్, తదితరులు పాల్గొన్నారు.

ఫోర్జరీ కేసులో ఇద్దరి రిమాండ్

పటాన్‌చెరుటౌన్ : ఫోర్జరీ, మోసం కేసులో ఇద్దరిని రిమాండ్‌కు తరలించిన ఘటన బీడీఎల్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. సీఐ రవీందర్ రెడ్డి కథనం ప్రకారం.. పటాన్‌చెరు మండలం పాశమైలారం పారిశ్రామిక వాడలోని సెన్సా కోర్ వైద్య పరీక్షల పరికరాల తయారీ పరిశ్రమలో పవన్ చంద్ర నాగూర్ కమర్షియల్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నాడు. ఇతడు నష్టం కల్గించే విధంగా మోసం, ఫోర్జరీ నేరాలకు పాల్పడడంతో యాజమాన్యం 2022 జూలైలో పోలీసులకు ఫిర్యాదు చేసింది. అప్పుడు నిందితుడు పవన్ చంద్ర నాగూర్ స్టేషన్ బెయిల్ తీసుకున్నాడు. కేసు విచారణ కొనసాగుతుండగా నాగూర్ మోసం, ఫోర్జరీ నేరాలు పాల్పడినట్లు తేలింది. దీంతో బీడీఎల్ పోలీసులు పలు సెక్షన్‌ల కింద కేసు నమోదు చేశారు. అతడితోపాటు, పరిశ్రమలో పనిచేసిన వరప్రసాద్ సహకరించడంతో మంగళవారం ఇద్దరిని అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించారు.

బైక్‌పై నుంచి పడి వ్యక్తి మృతి



లక్ష్మీపతి (ఫైల్)

రామాయంపేట (మెదక్): బైక్‌పై నుంచి పడి వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని ప్రగతి ధర్మారం వద్ద మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. ప్రగతి ధర్మారం గ్రామానికి చెందిన చౌకి లక్ష్మీపతి (45) రాత్రి పులిమామిడి నుంచి బైక్‌పై ధర్మారం వస్తున్నాడు. ఈ క్రమంలో బైక్ అదుపుతప్పి పడిపోవడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు.

17న ఉమ్మడి జిల్లా జట్ల ఎంపిక



మిరుదొడ్డి(దుబ్బాక): మెదక్ జిల్లా బాల్ బాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 17వ తేదీన సీనియర్ బాల్ బాడ్మింటన్ (బాల, బాలికలు) ఉమ్మడి జిల్లా జట్ల ఎంపిక చేయనున్నట్లు మెదక్ జిల్లా బాల్ బాడ్మింటన్ వర్కింగ్ ప్రెసిడెంట్ గొట్టం భైరయ్య, జనరల్ సెక్రెటరీ పీవీ. రమణ తెలిపారు. బుధవారం మిరుదొడ్డిలో వారు మాట్లాడుతూ.. ఆదివారం రోజున బీహెచ్‌ఈఎల్ రామచంద్రాపురంలోని సంకల్ప్ వెల్ఫేర్ అసోసియేషన్ ఓల్డ్ ఎంఐజీ గ్రౌండ్‌లో మధ్యాహ్నం 3 గంటలకు ఎంపిక ఉంటుందన్నారు. ఆసక్తి గల ఉమ్మడి జిల్లాకు చెందిన క్రీడాకారులు 3 పాస్ పోర్టు సైజు ఫొటోలతోపాటు, ఆధార్ కార్డు జిరాక్స్ కాపీని వెంట తెచ్చుకోవాలని సూచించారు. ఎంపికైన క్రీడా జట్లు ఈ నెల 22 నుంచి 24 వరకు నిర్వహించే 69వ సీనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ బాల్ బాడ్మింటన్ ఛాంపియన్ షిప్‌లో పాల్గొంటారని వెల్లడించారు. మరిన్ని 94407 03038, 97047 46511 నంబర్లను సంప్రదించాలని కోరారు.

ఏసీబీ అధికారుల నంబర్లూ పెట్టండి

అదనపు కలెక్టర్‌ను కోరిన సీసీఆర్ బృందం




శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రాన్ని అందిస్తున్న బృందం సభ్యులు

సిద్దిపేటరూరల్: జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఆర్‌టీఐ బోర్డులతోపాటుగా ఏసీబీ అధికారుల ఫోన్ నంబర్లతో కూడిన బోర్డులను ఏర్పాటు చేయాలని కోరుతూ బుధవారం కౌన్సిల్ ఫర్ సిటిజన్ రైట్స్ ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా సీసీఆర్ జిల్లా అధ్యక్షుడు గుండ్ల శివచంద్రం, మీడియా స్టేట్ కోఆర్డినేటర్ సాజిద్ మాట్లాడుతూ.. పారదర్శక పాలన కోసం సీసీఆర్ సంస్థ పాటుపడుతుందన్నారు. సీసీఆర్ జాతీయ కమిటీ ఆదేశాల మేరకు ప్రతీ ప్రభుత్వ కార్యాలయంలో ఏసీబీ అధికారుల ఫోన్ నంబర్లు ఏర్పాటు చేయాలని కోరుతూ వినతిపత్రాలను అందించామన్నారు. సానుకూలంగా స్పందించిన అదనపు కలెక్టర్ వెంటనే అధికారులతో ఫోన్‌లో మాట్లాడి ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారన్నారు. కార్యక్రమంలో సీసీఆర్ సభ్యులు శివ, ఫారూఖ్ అలీ, శ్రీనివాస్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో ఆటో డ్రైవర్ మృతి

- ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణంతో మనోవేదన



పెంద్యాల సారయ్య

అక్కన్నపేట (హుస్నాబాద్): హోటల్ వద్ద టీ తాగడానికి వెళ్లిన ఓ ఆటో డ్రైవర్ ఒక్కసారిగా కుప్పకూలి గుండెపోటుతో మృతి చెందాడు. ఈ ఘటన సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం గోవర్ధనగిరిలో బుధవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన పెంద్యాల సారయ్య(50) ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల ప్రభుత్వం ఆర్టీసీ బస్సులో మహిళలకు ఉచితం అంటూ ప్రవేశపెట్టడం, ఆర్థికంగా ఇబ్బందులు ఎక్కువగా ఉండడంతో ఒత్తిడికి లోనయ్యాడు. దీంతో గుండెపోటుకు గురయ్యాడని గ్రామస్థులు చెబుతున్నారు. మృతుడికి భార్య ఎల్లవ్వ, కుమారుడు, కుమార్తె ఉన్నారు.





నీటిని బయటకు పంపిస్తున్న మహిళా రైతు, కోయడానికి వీలు లేకుండా ఉన్న వరి పంట

కష్టాల్లో ముంచేను

- కోత దశలో చెరువుల నీరు వరి పొలాల్లోకి..
- కోయడానికి వీలు లేకుండా పంట
- లబోదిబోమంటున్న రైతులు



పొలాలకు వెళ్తున్న దుద్దె చెరువు నీళ్లు

కొండపాక(గజ్వేల్): అధికారుల అలసత్వం, ప్రజా ప్రతినిధుల ఉదాసీనతల మూలంగా కోత దశకు చేరిన వరి పంట పొలాల్లోనే ఉండిపోతోంది. ఈ హృదయ విదారకర ఘటన కుకునూరుపల్లి మండలంలోని మంగోల్ గ్రామంలో కనిపిస్తోంది. వివరాల్లోకి వెళ్తే.. మల్లన్న సాగర్ నుంచి మంగోల్ శివారులో నిర్మించిన 540 ఎల్‌ఎండీ వాటర్ ట్రీట్ మెంట్ ప్లాంట్‌కు నీటి పంపింగ్ జరుగుతోంది. వాటర్‌ను శుద్ధి చేయడంలో వృథాగా పోయే నీటిని గ్రామంలోని దుద్దె చెరువులోకి పంపిస్తున్నారు. దీంతో నెల రోజులగా చెరువు అలుగు పారుతోంది. చెరువు కట్ట కింద నుంచి నీరంతా జాలుగా వెళ్తూ వరి చేనులోకి చేరుతుంది. దీంతో పంట కోయలేకపోతున్నామంటూ అన్నదాతలు ఆవే దన వ్యక్తం చేస్తున్నారు.

నల్లచెరువుకు గండి..

కూలీల కొరతకు తోడు నీరు నిల్వ ఉండడంతో చైన్ మిషన్‌తో హార్వెస్టింగ్ చేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయంటూ రైతులు వాపోతున్నారు. మరో చోట ఉన్న నల్లచెరువుకు గండి పడి నీరంతా పొల్లాలో నుంచే బయటకు వెళ్తుంది. గండి పడిన విషయాన్ని ఇరిగేషన్ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదన్నారు. రెండు చెరువు కింద సుమారు 80 ఎకరాల వరి పంట కోతకు సిద్ధంగా ఉంది. చైన్ మిషన్‌ల కొరత మూలంగా గంటకు సుమారు రూ.3,500 ధరను చెల్లిసే గాని హార్వెస్టింగ్ చేయమంటు నిర్వాహకులు చెబుతున్నారు. పంటను సాగు చేయగా వచ్చే దిగుబడి పెట్టుబడులకు సరిపోవడం లేదంటూ అన్నదాతలు వాపోతున్నారు.

గండితో చెరువు నీరంతా వృథాగా పోయి యాసంగి పంటకు నీటి కొరత ఏర్పడే ప్రమాదం ఉందంటూ రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి చెరువుల నుంచి నీళ్లు పొలాల్లోకి రాకుండా చూడాలని రైతులు కోరుతున్నారు.

మూడు ఏటీఎంలలో చోరీ

- గ్యాస్ కట్టర్లతో పగులగొట్టి రూ.28 లక్షలు అపహరణ



ధ్వంసమైన ఏటీఎం

సదాశివపేట (సంగారెడ్డి): సంగారెడ్డి జిల్లా సదాశివ పేటలో వేర్వేరు చోట్ల ఏర్పాటు చేసిన మూడు ఏటీఎంలలో మంగళవారం అర్ధరాత్రి దొంగలు చోరీకి పాల్పడ్డారు. మొత్తం రూ.28లక్షల నగదును అపహరించారు. వివరాలు.. పట్టణంలోని తిలక్‌రోడ్డులోగల బసవేశ్వర మందిరం, గాంధీచౌక్, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల సమీపంలోని ఎస్‌బీఐకి చెందిన మూడు ఏటీఎంలలో దొంగలు చొరబడ్డారు. ముందుగా సీసీ కెమెరాలకు వైట్‌నర్ పూశారు. అనంతరం షట్టర్‌ల తాళాలు పగులగొట్టి, గ్యాస్‌కట్టర్‌లతో ఏటీఎంలను పగులగొట్టారు. వాటిలో ఉన్న డబ్బు లను అపహరించారు. మూడు ఏటీఎంలలో వేర్వేరుగా చోరీకి పాల్పడ్డారా..? లేదా అనే విషయం పోలీసులకు అంతుచిక్కడం లేదు. పోలీసులు చుట్టుపక్కల ఉన్న ఏటీఎంలను పరిశీలిస్తున్నారు. ఒక్క ఏటీఎం కేంద్రంలో దొంగతనం చేయడమే అసాధారణమని, అలాంటిది ఏకంగా మూడు ఏటీఎంలు చోరీకి గురికావడం విస్మయం కలిగిస్తుంది. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఇన్‌స్పెక్టర్ నవీన్‌కుమార్ తెలిపారు.

ద్విచక్ర వాహనం, కారు ఢీ

- ఒకరు మృతి, నలుగురికి తప్పిన ప్రమాదం



నర్సయ్య మృతదేహం

వట్‌పల్లి(అందోల్): ద్విచక్ర (ఎక్సెల్) వాహనం, కారు ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందగా, నలుగురికి ప్రమాదం తప్పింది. ఈ ఘటన బుధవారం అందోల్ మండల పరిధిలోని సంగుపేట వద్ద 161 నాందేడ్ హైవే పై చోటు చేసుకుంది. జోగిపేట ఎస్ఐ–2 మొగులయ్య తెలిపిన వివరాల ప్రకారం.. సంగుపేట గ్రామానికి చెందిన డప్పు నర్సయ్య (60) ఎక్సెల్ వాహనంపై చందంపేట గ్రామానికి వెళ్లి కిరాణా షాపు వస్తువులు, కోడి గుడ్లు తీసుకొని తిరుగు ప్రయాణం అయ్యాడు. నాందేడ్ హైవేపై స్వగ్రామానికి వస్తున్న క్రమంలోనే ఓ కుటుంబం నిజామాబాద్‌లో జరిగిన అంత్యక్రియల్లో పాల్గొని తిరిగి కారులో హైదరాబాద్‌కు వస్తుంది. సంగుపేట వద్దకు రాగానే వీరి కారు, ఎక్సెల్ వేగంగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఎక్సెల్‌పై ఉన్న నర్సయ్యకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదంలో కారు ముందు భాగం ధ్వంసం కాగా, బెలూన్‌లు తెరుచుకోవడంతో నలుగురు ప్రాణాలతో బయటపడ్డారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అంబులెన్స్ రాక ఆగిన ఊపిరి..

ప్రమాదం జరిగిన వెంటనే అక్కడున్న వారు 108 అంబులెన్స్‌కు, జోగిపేట పోలీసులకు సమాచారం అందించారు. అంబులెన్స్ సమయానికి రాకపోవడంతో తీవ్ర గాయాలైన నర్సయ్య 20 నిమిషాల పాటు ప్రాణాలతో కొట్టుమిట్టాడి మృతి చెందాడు. మృతదేహాన్ని ఓ ప్రైవేట్ అంబులెన్స్‌లో జోగిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అంబులెన్స్ సమయానికి వస్తే బతికేవాడేమోనని అక్కడున్న వారు అసంతృప్తిని వ్యక్తం చేశారు.

బైక్‌ను తప్పించబోయి..

- స్తంభాన్ని ఢీకొట్టిన తుఫాన్ వాహనం
- పలువురికి గాయాలు



ప్రమాద స్థలంలో తుఫాన్ వాహనం

అల్లాదుర్గం(మెదక్): బైక్‌పై వెళ్తున్న వ్యక్తి సడన్ బ్రేక్ వేయడంతో వెనుక వస్తున్న తుఫాన్ వాహనం అదుపుతప్పి స్తంభాన్ని ఢీకొట్టింది. ఈ ఘటన బుధవారం చిల్వెర గ్రామ శివారులో చోటు చేసుకుంది. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం ఓ వ్యక్తి చిల్వెర నుంచి అల్లాదుర్గం వైపు బైక్‌పై వెళ్తున్నాడు. చిల్వెర శివారులోకి రాగానే పోలీసులు ఎదురుగా వస్తుండడంతో ఫైన్ వేస్తారనే భయంతో బైక్‌ను సడన్‌గా ఆపాడు. అతడి వెనుక నుంచే అల్లాదుర్గం వస్తున్న తుఫాన్ వాహనం బైక్‌ను తప్పించబోయి అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న స్తంభాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తుఫాన్‌లో ఉన్న పలువురికి గాయాలయ్యాయి. సంగారెడ్డి జిల్లా నిజాంపేట మండలం బచ్‌పల్లి గ్రామానికి చెందిన రాములుకు తీవ్ర గాయాలు కావడంతో 108 అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు.

హార్డ్‌వేర్ షాపులో చోరీ



సీసీ ఫుటేజీలో గుర్తు తెలియని వ్యక్తి

హత్నూర(సంగారెడ్డి): హార్డ్‌వేర్ షాపులో గుర్తు తెలియని దొంగలు చోరీకి పాల్పడిన ఘటన హత్నూర మండలం దౌల్తాబాద్‌లో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్సై సుభాష్ తెలిపిన వివరాల ప్రకారం.. దౌల్తాబాద్ గ్రామానికి చెందిన మమ్మద్ వాహబ్ హార్డ్‌వేర్ షాపు నిర్వహిస్తున్నాడు. దుండగులు రాత్రిపూట షాపు షటర్ తాళాలు పగులగొట్టి నగదుతో పాటు సామగ్రిని ఎత్తుకెళ్లారు. యజమాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. సీసీ కెమెరాల ఫుటేజీ పరిశీలిస్తున్నట్లు పేర్కొన్నారు.

మద్యం షాపులో..

హుస్నాబాద్: ఓ మద్యం షాపులో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడిన ఘటన హుస్నాబాద్ పట్టణంలోని అక్కన్నపేట రోడ్‌లో మంగళవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. షాపు వెనుక భాగంలోని తలుపులు పగులగొట్టి కౌంటర్‌లోని నగదు రూ.10 వేలు, రెండు ఫుల్ బాటిల్స్ అపహరించారు. సీసీ కెమెరా తీగలను కట్ చేసి రికార్డింగ్ డీవీఆర్ సెట్‌ను దొంగలించారు. షాపు నిర్వాహకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.